# ముఖ్యమంత్రి కార్యాలయము

# తెలంగాణ ప్రభుత్వం

**పత్రికా ప్రకటన** **తేది: 21-05-2016**

తెలంగాణ రాష్ట్ర సాధన కోసం జరిగిన ఉద్యమంలో ప్రాణాలు అర్పించిన అమరవీరుల కుటుంబ సభ్యుడికి/సభ్యురాలికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని ముఖ్యమంత్రి శ్రీ కె. చంద్రశేఖర్ రావు నిర్ణయించారు. వచ్చే నెల 2న జరిగే రాష్ట్ర అవతరణ దినోత్సవం రోజున ఉద్యోగ నియామక పత్రాలు అందించాలని అధికారులను ఆదేశించారు. ఆయా జిల్లాలకు చెందిన మంత్రులు ఆయా జిల్లాలకు చెందిన అమరవీరుల కుటుంబాలను సన్మానించి, ఈ నియామక పత్రాలను అందచేయాలని సిఎం సూచించారు. ఈలోగా అన్ని జిల్లాల్లో నియామక పత్రాలు తయారు చేయాలని ఆదేశించారు. హైదరాబాద్ లో జరిగే ప్రధాన కార్యక్రమంలో ముఖ్యమంత్రి కేసీఆర్ స్వయంగా కొందరికి ప్రభుత్వ ఉద్యోగ నియామక పత్రాలు అందచేస్తారు. ప్రాణ త్యాగం చేసిన వారి కుటుంబ సభ్యులు సూచించిన వ్యక్తికి ఉద్యోగ అవకాశం ఇవ్వాలని, కనీస విద్యార్హతలు లేకున్నా ఉద్యోగమిచ్చి, అర్హతలు సాధించడానికి ఐదేళ్ల సమయం ఇవ్వాలని కూడా సిఎం సూచించారు. రాష్ట్ర అవతరణ దినోత్సవం నిర్వహణ, ఈ సందర్భంగా చేయాల్సిన కార్యక్రమాల గురించి ముఖ్యమంత్రి కేసీఆర్ శుక్రవారం క్యాంపు కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు.

మంత్రి లక్ష్మారెడ్డి, ఎంపిలు జితేందర్ రెడ్డి, బి. వినోద్ కుమార్, కల్వకుంట్ల కవిత, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రాజీవ్ శర్మ, సీనియర్ అధికారులు రేమండ్ పీటర్, బిఆర్ మీనా, శివశంకర్, వెంకటేశ్వర్లు, శాంతకుమారి, వరంగల్ కలెక్టర్ కరుణ, సిఎంఒ అదనపు కార్యదర్శి స్మితా సభర్వాల్, ప్రత్యేక కార్యదర్శి భూపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జూన్ 2న జరిగే రాష్ట్ర అవతరణ దినోత్సవం రోజున పతాకావిష్కరణ, అవార్డుల ప్రదానం, తదిరత కార్యక్రమాలు నిర్వహించేందుకు జిల్లాల వారీగా మంత్రులకు బాధ్యతలు అప్పగించారు. హైదరాబాద్ లోని పరేడ్ గ్రౌండ్లో జరిగే ప్రధాన కార్యక్రమంలో గవర్నర్ నరసింహన్, ముఖ్యమంత్రి కె. చంద్రశేఖర్ రావు పాల్గొంటారు. వరంగల్లో ఉప ముఖ్యమంత్రి కడియం శ్రీహరి, మెదక్ లో హరీష్ రావు, ఆదిలాబాద్ లో జోగు రామన్న, నిజామాబాద్ లో పోచారం శ్రీనివాసరెడ్డి, ఖమ్మంలో తుమ్మల నాగేశ్వరావు, రంగారెడ్డిలో మహేందర్ రెడ్డి, నల్గొండలో జగదీష్ రెడ్డి, మహబూబ్ నగర్ లో జూపల్లి కృష్ణారావు, కరీంనగర్లో ఈటెల రాజేందర్ కు బాధ్యతలు అప్పగించారు.

రాష్ట్ర అవతరణ దినోత్సవ ఏర్పాట్లు, అమర వీరుల కుటుంబాలకు ఉద్యోగాలు, భూ వివాదాల పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలు తదితర అంశాలపై చర్చించేందుకు ఈనెల 23న ఎం.సి.ఆర్.హెచ్.ఆర్.డీలో ముఖ్యమంత్రి కలెక్టర్లతో సమావేశం కానున్నారు.

**సిపిఆర్ఓ టు సిఎం**